## చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా జగన్‌రెడ్డి

సికింద్రాబాద్: చిలకలగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బత్తుల జగన్‌రెడ్డి నియమితులయ్యారు. సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉన్న జగన్‌రెడ్డిని చిలకలగూడ ట్రాఫిక్ పీఎస్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేశారు. చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన సీహెచ్ శ్రీనివాసులు గోపాలపురం పీఎస్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయ్యారు. రెండు రోజుల్లో ఇరువురు అధికారులు బాధ్యతలు స్వీకరించనున్నారు.

## విద్యుత్ శాఖ అధికారుల బస్తీ బాట



బస్తీబాటలో విద్యుత్ శాఖ అధికారులు

రాంగోపాల్‌పేట్: తెలంగాణ విద్యుత్ పంపిణీ వ్యవస్థ సీఎండీ ఆదేశాల మేరకు మంగళవారం జనరల్‌బజార్‌లో విద్యుత్ శాఖ అధికారులు బస్తీబాట నిర్వహించారు. లాలాగుడి ప్రాంతంలో ఏఈ కాసం రవికుమార్ స్థానికులతో మాట్లాడి విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లాలాగూడి ప్రాంతంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచెను ఏర్పాటు చేయాలని స్థానిక నాయకుడు అశోక్ అధికారులను కోరారు. కంచె లేకపోవడంతో ప్రమాదభరితంగా మారిందని స్థానికులు భయాందోళన చెందుతున్నారని ఆయన వివరించారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చెత్త వేయకూడదని అలా వేస్తే అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఏఈ తెలిపారు. ప్రమాదభరితంగా మారిన కేబుల్ వైర్లను తొలగిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## అంగన్ వాడీ కేంద్రాలను పటిష్టం చేయాలి



కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

అమీర్‌పేట: అంగన్ వాడీ కేంద్రాలను పటిష్టం చేయడమే కాకుండా తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని తెలంగాణ అంగన్ వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ విజ్ఞప్తి చేసింది. మంగళవారం అమీర్‌పేటలోని మహిళాభివృద్ధి, స్త్రీ సంక్షేమ శాఖ కమిషనర్ వివిధ యూనియన్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్ వాడి ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. యూనియన్ అధ్యక్షురాలు నల్ల భారతి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు టీచర్లు,హెల్పర్లకు రూ.18000 వేతనం ఇవ్వాలని కోరారు. 2024 జులై 1న ,2025 ఏప్రిల్‌లో రిటైర్ అయిన వారికి వెంటనే రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. ఎలాంటి షరతులు లేకుండా ఆసరా పెన్షన్లు అందజేయాలని, కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అంగన్ వాడీ కేంద్రాల్లో ఇప్పటికే ప్రీ ప్రైమరీ విద్యా బోధన జరుగుతున్నందున ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ప్రీ ప్రైమరీ విద్యా కేంద్రాల నిర్వహణ బాధ్యత అంగన్ వాడీ టీచర్లకు అప్పగించాలన్నారు. బతుకమ్మ పండుగ నేపథ్యంలో ఈ నెల 21 నుంచి అక్టోబర్ 3 వరకు దసరా సెలవులు ప్రకటించి లబ్ధిదారులకు టీహెచ్‌ఆర్‌కు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు వీరగోని రమాతార, మాచర్ల వేదవతి తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు సేఫ్టీ కిట్ల పంపిణీ



సేఫ్టీ కిట్లను అందజేస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: డివిజన్‌ను చెత్త రహితంగా, పరిశుభ్రంగా ఉంచేందుకు అన్ని విధాల కృషి చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ లింగాని ప్రసన్న లక్ష్మీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం అడ్డగుట్టలోని కార్పొరేటర్ కార్యాలయం వద్ద ఆమె పారిశుద్ధ్య కార్మికులకు సేఫ్టీ కిట్లను పంపిణీ చేశారు. చెత్త రహిత సమాజం కోసం పారిశుధ్య కార్మికులు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. పరిసరాల పరిశుభ్రతను ప్రజలు సామాజిక బాధ్యతగా తీసుకుని భాగస్వాములు కావాలని సూచించారు. కాలనీలు, బస్తీల పరిశుభ్రతకు నిత్యం సేవలందించే కార్మికులు ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో సేఫ్టీ కిట్లను అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

### కంటోన్మెంట్ కమలంలో

# ఆధిపత్య లొల్లి

### తారాస్థాయికి వర్గ విభేదాలు

- రాజ్‌నాథ్ సింగ్ రాక నేపథ్యంలో మరింత ముదిరిన వైనం
- ఇద్దరు మాజీ వీపీల పోరుతో గందరగోళంలో క్యాడర్
- కిషన్ రెడ్డి వర్సెస్ ఈటల

కంటోన్మెంట్: నగరంలో గోషామహల్ తర్వాత భారతీయ జనతాపార్టీకి అత్యంత బలం కలిగిన అసెంబ్లీ స్థానం కంటోన్మెంట్. 2023 అసెంబ్లీ, గత ఏడాది జరిగిన ఉప ఎన్నికల్లోనూ ఈ నియోజకవర్గంలో బీజేపీ అభ్యర్థులు రెండో స్థానంలో నిలిచారు. ఈ ఫలితాలతో రాబోయే రోజుల్లో కంటోన్మెంట్‌లో బీజేపీ విజయం ఖాయం అని క్యాడర్‌లో ఉత్సాహం పెరిగింది. అయితే నియోజకవర్గ ముఖ్య నేతల మధ్య విబేధాలతో క్యాడర్‌లో గందరగోళం నెలకొంది. ఏ నాయకుడి సమావేశాలకు వెళ్లాలో తెలియక అయోమయానికి లోనవుతున్నారు. తాజాగా కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కంటోన్మెంట్‌లో పర్యటించనున్న నేపథ్యంలో విబేధాలు మరింత ముదిరాయి. ఎవరికి వారిగా సదరు నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, స్వాగత బ్యానర్‌లు చర్చనీయాంశం అయ్యాయి. పైకి ఈ వివాదం కంటోన్మెంట్ నేతల మధ్యే సాగుతున్నట్లుగా కనిపిస్తున్నా, కిషన్ రెడ్డి వర్సెస్ ఈటల అన్నట్లుగా ఆయా వర్గాలు విడిపోయినట్లు స్పష్టంగా కనిపిస్తోంది. తమ పార్టీ క్రమశిక్షణకు మారుపేరుగా చెప్పుకునే క్యాడర్‌కు, పార్టీలో చోటు చేసుకుంటున్న తాజా పరిణామాలు ఇబ్బందిగా మారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

#### ఐదేళ్లుగా పుంజుకుంటూ వచ్చి..

ఐదేళ్ల క్రితం సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సభ్యుల మధ్య మొదలైన వర్గ విభేదాలు బీజేపీకి కలిసొచ్చాయి. 2020 సెప్టెంబర్ జరిగిన నాటకీయ పరిణామాల నేపథ్యంలో బోర్డు ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్న జే. రామకృష్ణ బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేయాల్సి వచ్చింది. దీనిని జీర్ణించుకోలేని బీఆర్‌ఎస్ పెద్దలు అతడిని పదవి నుంచి తప్పించేందుకు భారీగా కసరత్తు చేయాల్సి వచ్చింది. ఈ క్రమంలో అదే ఏడాది నవంబర్‌లో రామకృష్ణ, మరో బోర్డు మాజీ ఉపాధ్యక్షురాలు భానుక నర్మద మల్లికార్జున్‌తో కలిసి బీజేపీలో చేరారు. దీంతో బీజేపీ క్యాడర్‌లో ఊపు మొదలైంది. 2018లో బీజేపీ నుంచి పోటీ చేసిన శ్రీగణేష్, మధ్యలో పార్టీ విడినప్పటికీ, మళ్లీ 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో తిరిగి బీజేపీలో చేరారు. ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన 40వేలకు పైగా ఓట్లు సాధించారు. మరుసటి ఏడాది జరిగిన ఉప ఎన్నికల నాటికి శ్రీగణేశ్ కాంగ్రెస్‌లో చేరి విజయం సాధించగా, ఈ ఎన్నికల్లోనూ బీజేపీ అభ్యర్థి వంశ తిలక్ సైతం 40 వేలకు పైగా ఓట్లతో రెండోస్థానంలో నిలవడం గమనార్హం. ఈ రెండు ఎన్నికల్లోనూ రామకృష్ణ, బానుక నర్మద మల్లికార్జున కీలకంగా వ్యవహరించారు.



రామకృష్ణ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

#### బోర్డులో ఆధిపత్య పోరు..

నాలుగేళ్లుగా కంటోన్మెంట్ ఎన్నికలు జరగకపోవడంతో సహజంగానే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ వ్యక్తినే నామినేటెడ్ సభ్యులుగా నియమిస్తున్నారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆశీస్సులతో 2021లో రామకృష్ణ బోర్డు నామినేటెడ్ సభ్యుడిగా నియమితులు కాగా వరుసగా మూడుసార్లు ఆయన పదవీకాలం పొడిగిస్తూ వచ్చారు. అయితే 2024 పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడిగా ఈటల రాజేందర్ గెలుపుతో కంటోన్మెంట్ బీజేపీలోనూ వర్గ పోరు మొదలైంది. రామకృష్ణను నామినేటెడ్ పదవి నుంచి తప్పించాలంటూ పలువురు బీజేపీ నేతలు ఆయనపై ఒత్తిడి తెచ్చారు. ఈ మేరకు ఈటల ఏకంగా రాజ్‌నాథ్ సింగ్‌కు విజ్ఞప్తి చేసినా లాభం లేకుండా పోయింది. ఈ ఏడాది జనవరిలోనూ రామకృష్ణ పదవీకాలాన్ని పొడగించారు. దీనిని సీరియస్‌గా పరిగణించిన ఈటల, పార్టీ పెద్దలపై ఒత్తిడి పెంచి ఏకంగా కేంద్రం జారీ చేసిన గజిట్‌లోనూ మార్పులు చేయించారు. రామకృష్ణ స్థానంలో భానుక నర్మదకు అవకాశం కల్పించారు. దీంతో కంటోన్మెంట్ బీజేపీలో క్యాడర్‌లోనూ స్పష్టమైన చీలిక వచ్చింది. భానుక వర్గీయులు ఈటలను, రామకృష్ణ వర్గీయులు కిషన్ రెడ్డిని అనుసరిస్తూ వస్తున్నారు. కొందరు నేతలు, కార్యకర్తలు మాత్రం తటస్థంగా ఉంటూ ఇద్దరి కార్యక్రమాలకూ హాజరవుతున్నారు.



పికెట్ పార్కు వద్ద భానుక నర్మద, మల్లికార్జున్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

#### తాజాగా ఫ్లెక్సీ వార్..

బుధవారం పరేడ్ గ్రౌండ్‌లో జరిగే విమోచన దినోత్సవంలో కార్యక్రమానికి హాజరుకానున్న కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్, అనంతరం కంటోన్మెంట్‌లోని పికెట్ పార్కులో వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. ఈ నేపథ్యంలో పికెట్ పార్కు చుట్టూ రామకృష్ణ, భానుక నర్మద మల్లికార్జున్ వేర్వేరుగా పదుల సంఖ్యలో బ్యానర్‌లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఒకరి ఫ్లెక్సీలో మరొకరి ఫొటోలు లేవు. పార్కు కనిపించడకుండా నింపేసిన ఈ ఫ్లెక్సీలు, బ్యానర్‌లపై బోర్డు అధికారులు సైతం అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయినా ఇద్దరు నేతలు బీజేపీకి చెందిన వారు కావడంతో ఏమీ చేయలేకపోతున్నారు. ఇదిలా ఉండగా రాజ్‌సింగ్ సభ సన్నాహక సమావేశాల్లో, ఇద్దరు నేతల వ్యవహారంపై క్యాడర్ అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. రాజ్‌నాథ్ సింగ్ పర్యటన ముగిశాక కంటోన్మెంట్ బీజేపీలో వర్గ విబేధాలపై దృష్టి సారిస్తామని పార్టీ అధిష్టానం వారికి సర్దిచెప్పినట్లు సమాచారం. మొత్తానికి పార్టీ నేతల మధ్య కొనసాగుతున్న వార్, క్యాడర్‌ను గందరగోళానికి గురిచేస్తూ పార్టీ పుట్టి ముంచుతుందని కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు..

సనత్‌నగర్: టమాటా.17, నల్లవంకాయ 21, పొడుగు వంకాయ 21, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 35, క్యాప్సికమ్ 55, పచ్చకాకర 27, పందిరి బీర 38, క్యాబేజీ 17, క్యారెట్ 35, దొండ 35, గుండుబీన్స్ 35, గింజ చిక్కుడు 45, గోకర కాయ 35, కీర 18, దోసకాయ 13, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 18, ఆలుగడ్డ 23, చామగడ్డ 23, మొరంగడ్డ 35, కందగడ్డ 55, సొరకాయ 15, పొట్లకాయ 23, అరటికాయ 11, మునగకాయ 3-4, ముల్లంగి 3-5. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డీబీఆర్‌సీ రాష్ట్ర కోఆర్డినేటర్ నళిని

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేట ఇందిరానగర్‌లో మంగళవారం దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీబీఆర్‌సీ రాష్ట్ర కోఆర్డీనేటర్ ఎం. నళిని మాట్లాడుతూ అర్హులందరూ ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సామాజిక కార్యకర్త చవ్వ రఘుపతిరావు మాట్లాడుతూ బస్తీల్లోని పిల్లలు డ్రా పవుట్స్ కారణంగానే మద్యానికి, డ్రగ్స్ వంటి చెడు వ్యసనాల భారీనపడుతున్నారన్నారు. డ్రాప్ అవుట్స్‌ను గుర్తించి తిరిగి వారిని స్కూల్ పంపే కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అవసరమైన ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో స్థానిక బస్తీ నాయకులు మల్లికార్జున్, పలువురు మహిళలు పాల్గొన్నారు.

## మోదీ నేతృత్వంలోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

లాలాపేట: మోదీ పాలనలోనే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మంగళవారం తార్నాకలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. సెప్టెంబర్ 17 అంటే తెలంగాణ ప్రజలు విముక్తి పొందిన రోజే గాక దేశ ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం అన్నారు. ఈ మేరకు ప్రధాని మోదీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మోదీ నాయకత్వంలో ప్రపంచ పటంలో భారత జాతి గౌరవం, ఔన్నత్యం పెరిగిందన్నారు. పేద దేశంగా, థర్డ్ వరల్డ్ కంట్రీగా ముద్రపడ్డ భారత దేశం నేడు అత్యంత వేగంగా ఎదుగుతున్న దేశంగా, ప్రపంచంలో నాల్గో ఆర్థిక వ్యవస్థగా గుర్తింపు పొందిందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఏ దేశానికి సమస్య వచ్చినా ప్రధాని నరేంద్ర మోదీ అండగా ఉంటారనీ విశ్వాసాన్ని కల్గించారన్నారు. రానున్న రోజుల్లో మోదీ నాయకత్వంలో దేశం మరింత వేగంగా అభివృద్ధి చెంది, ప్రజల మధ్య అంతరాలు తొలగి పోవాలని ఆకాంక్షించారు. ఈటల వెంట నాయకులు బండ చంద్రారెడ్డి, శారదా మల్లేష్, వెంకటేష్‌గౌడ్ ఉన్నారు.

## అక్రమంగా నిర్మిస్తున్న భవనం సీజ్



చిలకలగూడ: సికింద్రాబాద్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అధికారులు అక్రమ భవన నిర్మాణాలపై కొరడా ఝులిపించారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఐదు అంతస్తుల భవనాన్ని సీజ్ చేశారు. వివరాల్లోకి సీతాఫల్‌మండి డివిజన్ చిలకలగూడ జీహెచ్‌ఎంసీ పార్కు వెనుక వ్యక్తి రెండు అంతస్తుల భవనాన్ని నిర్మించేందుకు టౌన్‌ప్లానింగ్ విభాగం నుంచి అనుమతి తీసుకున్నాడు. సదరు రెండు అంతస్తులతోపాటు ఆపై మరో మూడు అంతస్తులను అక్రమంగా నిర్మించాడు. దీనిపై స్థానికులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ల ఆదేశాల మేరకు సికింద్రాబాద్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ పావనీ నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్‌బృందం, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది మంగళవారం అక్రమ నిర్మాణాన్ని పరిశీలించారు. నిబంధనలను అతిక్రమించి అదనంగా మరో మూడు అంతస్తులు నిర్మించినట్లు నిర్ధారించి, వాటిని సీజ్ చేశారు. అక్రమంగా నిర్మించిన మూడు అంతస్తులను జీహెచ్‌ఎంసీ యాక్టు 1955 అండర్ సెక్షన్ 461-ఏ ప్రకారం సీజ్ చేసినట్లు బ్యానర్ ఏర్పాటు చేశారు. చిలకలగూడ, సీతాఫల్‌మండి, మైలార్‌గడ్డ, నామలగుండు, అన్నానగర్, శ్రీనివాసనగర్ తదితర ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు అందాయని, త్వరలోనే వాటిని గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

## మొక్కలు నాటుదాం.. ఓజోన్ పొరను కాపాడుకుందాం..



కార్యక్రమంలో పాల్గొన్న టీజీపీసీబీ సభ్య కార్యదర్శి రవి తదితరులు

సనత్‌నగర్: సనత్‌నగర్‌లోని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) కార్యాలయంలో మంగళవారం ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీజీపీసీబీ సభ్య కార్యదర్శి రవి మాట్లాడుతూ సూర్యుని నుంచి వచ్చే హానికరమైన అల్ట్రావయొలెట్ కిరణాల నుంచి భూమిని కాపాడేందుకు ఓజోన్ పొర రక్షణ కవచంలా పని చేస్తుందన్నారు. క్లోరోఫ్లోరో కార్బన్లు, హైడ్రో క్లోరో ఫ్లోరో కార్బన్లు వంటి రసాయనాలు ఓజోన్ పొరను క్షీణింపజేస్తాయన్నారు. ఫలితంగా చర్మ కేన్సర్, కంటి సమస్యలు వస్తాయన్నారు. ఓజోన్ పొరను రక్షించడానికి మొక్కలు నాటడం, పర్యావరణ అనుకూల ఉత్పత్తులను ఉపయోగించడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, స్థిరమైన జీవనశైలిని ప్రోత్సహించడం అవసరమన్నారు. పర్యావరణ శాస్త్రవేత్త నాగేశ్వరరావు ఓజోన్ క్షీణత, పర్యావరణంపై కలిగే హానికర ప్రభావాలను వివరించారు. ఓజోన్‌ను క్షీణింపజేసే రసాయనాలు, మాంట్రియల్ ప్రోటోకాల్‌పై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, టీజీపీసీబీ శాస్త్రవేత్తలు, సీనియర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## హామీల అమలులో ప్రభుత్వం విఫలం



చెక్కులు పంపిణీ చేస్తున్న తలసాని శ్రీనివాస్

రాంగోపాల్‌పేట్: ఆచరణ సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేస్తుందని మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మంగళవారం సికింద్రాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో సికింద్రాబాద్, ఖైరతాబాద్, ముషీరాబాద్ మండలాలకు చెందిన 47 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల ఇంట్లో ఆడబిడ్డ పెళ్లి జరిగితే చేయూతనందించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం రూ.1,00,116 ఆర్థిక సహాయం అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు అదనంగా తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చి 22 నెలలు గడిచినా అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, యూరియా కోసం రైతులు రోడ్ల మీదకు వస్తున్నారన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఎప్పుడు ఇలాంటి పరిస్థితి కనిపించలేదని అన్నారు. ప్రభుత్వ ఖజానా ఖాళీ అయిందని హామీలు అమలు చేయలేమని ప్రజల ముందుకు వచ్చి చెప్పే ధైర్యం ప్రభుత్వానికి ఉందా అని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు చీర సుచిత్ర, కుర్మ హేమలత, మహేశ్వరి తహసీల్దార్ పాండునాయక్, బీఆర్‌ఎస్ నాయకులు ఆకుల హరికృష్ణ, హన్మంతరావు, స్కైలాబ్, వెంకటేషన్ రాజు, శ్రీనివాస్‌గౌడ్, శ్రీహరి, నరేందర్, లక్ష్మీపతి, నాగేందర్, మహేష్ యాదవ్, ప్రేమ్‌కుమార్, మహేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ ప్రతిష్టాన్ స్వర్ణోత్సవ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా కోట నీలిమ..



నియామకపత్రం అందుకుంటున్న కోట నీలిమ..

సనత్‌నగర్: టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కోట నీలిమ గాంధీజ్ఞాన్ ప్రతిష్టాన్ స్వర్ణోత్సవ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. ఈ మేరకు గాంధీ ప్రతిష్టాన్ స్వర్ణోత్సవ కమిటీ చైర్మన్ రాజేందర్‌రెడ్డి , వైస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సెక్రటరీ సుబ్రహ్మణ్యం మంగళవారం ఆమెకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కోట నీలిమ మాట్లాడుతూ గాంధీ జ్ఞాన్ ప్రతిష్టాన్ ఏర్పాటుచేసి 50 ఏళ్ల పూర్తయిన సందర్భంగా స్వర్ణోత్సవ కమిటీ వైస్ ప్రెసిడెంట్‌గా తనను ఎన్నుకున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ఇందులో భాగంగా మహాత్మాగాంధీ ఆలోచన విధానాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు అవకాశం లభించిందన్నారు. గాంధీ త్యాగాన్ని, ఆలోచన విధానాన్ని దేశానికి, సమాజానికి మరోసారి గుర్తుచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎప్పటికైనా భారతదేశానికి గాంధీ సిద్ధాంతమే శ్రీరామరక్ష అని, శాంతియుత మార్గంలోనే మనకు విజయం వరిస్తోందన్నారు. గాంధీజ్ఞాన్ ప్రతిష్టాన్ గోల్డెన్ జూబ్లీ వేడుకలు అక్టోబర్ 10 నుంచి 14 వరకు ఎల్బీస్టేడియంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అందరం కలిసికట్టుగా వేడుకలను విజయవంతం చేయాలని కోరారు.

## పోలీసు విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తి రిమాండ్

అడ్డగుట్ట: విధుల్లో ఉన్న పోలీసులతో దురుసుగా ప్రవర్తించడమేగాక వారి విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అడ్డగుట్టలోని మారేడ్‌పల్లి మండల కార్యాలయం ఎదుట తిరుమల రావు అనే వ్యక్తి జిరాక్స్ షాపు నిర్వహిస్తున్నాడు. సోమవారం పెన్షన్ పెంపు కోసం దివ్యాంగులు మండల కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ క్రమంలో కొందరు వికలాంగులు అతడి షాపు పక్కన కూర్చోవడంతో వారిని అక్కడి నుంచి వెళ్లిపొమ్మని దురుసుగా చెప్పడంతో వాగ్వాదం చోటు చేసుకుంది. దీనిపై సమాచారం అందడంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఇరువురికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయితే తిరుమల రావు పోలీసులతో కూడా దురుసుగా ప్రవర్తించడమే కాకుండా వారి విధులకు ఆటంకం కలిగించాడు. దివ్యాంగులతో పాటు కానిస్టేబుళ్ల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం అతడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## గంజాయి రవాణా కేసులో మహిళ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జావెద్, ఇన్‌స్పెక్టర్ సాయిూశ్వర్‌గౌడ్

సికింద్రాబాద్: గంజాయి రవాణాకు సహకరిస్తున్న మహిళను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆమె నుంచి రూ.3.95 లక్షల విలువ చేసే 7.9 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జీఆర్‌పీ డీఎస్పీ ఎస్‌ఎన్ జావెద్, ఇన్‌స్పెక్టర్ బీ.సాయిూశ్వర్‌గౌడ్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా, ముచ్చింగి పుట్టుకు చెందిన బొబ్బర్ల లక్ష్మి కూలీగా పని చేస్తోంది. ఆమె గల కొన్నేళ్లుగా అదే ప్రాంతానికి చెందిన గంజాయి వ్యాపారి బోన్య అనే మహిళతో పరిచయం ఉంది. ఈ నేపథ్యంలో రైళ్ల ద్వారా గంజాయి అక్రమ రవాణా చేస్తున్న బోన్యకు లక్ష్మి సహాయకురాలిగా వ్యవహరిస్తుంది. ఈ నెల 14న వారు ఇరువురు విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో షోలాపూర్‌కు గంజాయిని తరలిస్తూ 15న ఉదయం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ చేరుకున్నారు. అదే సమయంలో రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు లక్ష్మిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల తనిఖీలను పసిగట్టిన బోన్య అక్కడి నుంచి పరారైంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు లక్ష్మిని రిమాండ్‌కు తరలించి, ప్రధాన నిందితురాలైన బోన్య కోసం గాలిస్తున్నారు.

## విమోచన దినోత్సవ వేడుకలకు ముస్తాబు

కంటోన్మెంట్: కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న తెలంగాణ విమోచన దినోత్సవాలకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ సర్వాంగ సుందరంగా తయారైంది. ఓ పక్క స్వాగత తోరణాలు, గ్రౌండ్ ఆవరణలో తెలంగాణ విమోచనానికి సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం ప్రారంభమయ్యే వేడుకల్లో ఆర్మీ, సీఆర్‌పీఎఫ్, ఎన్‌సీసీ తదితర విభాగాల మార్చ్ ఫాస్ట్, సాంస్కృతిక ప్రదర్శనలకు సంబంధించి రిహార్సల్స్ నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పరేడ్ మైదానంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. విమోచన దినోత్సవం ముగిసిన అనంతరం పికెట్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన అటల్ బిహారీ వాజ్‌పేయి విగ్రహాన్ని రాజ్ నాథ్ సింగ్ ఆవిష్కరించనున్నారు.



కళాకారుల రిహార్సల్స్

హైదరాబాద్ విమోచన దినం సందర్భంగా పరేడ్ గ్రౌండ్‌లో బుధవారం నిర్వహించనున్న ఉత్సవాల నేపథ్యంలో కళాకారులు రిహార్సల్స్ నిర్వహించారు. మంగళవారం పరేడ్ మైదానంలో డప్పు కళాకారులు, కోలాటం, సన్నాయి మేళం, మర్ఫా, బోనాలు, లంబాడీ నృత్యాలు తదితర కళాకారులు రిహార్సల్స్ నిర్వహించారు.









